సాక్షి
కాకినాడ
సోమవారం । 24 । జూలై । 2023



రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి తెలిదేవర నాగ శ్రీవత్స (రాజమహేంద్రవరం) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



భక్త మహాశయులకు...

రత్నగిరికి మెట్ల మార్గంలో వచ్చే సత్యదేవుని భక్తుల కోసం వనదుర్గ ఆలయం ఎదురుగా రూ.2 కోట్లతో విశ్రాంతి భవన నిర్మాణం చకచకా జరుగుతోంది. - 8లో▸

భారీ వాహనాలకు నో ఎంట్రీ



రాజమహేంద్రవరం - కొవ్వూరు మధ్య ఉన్న రోడ్ కం రైలు వంతెనపై ఆదివారం నుంచి లారీలు, బస్సుల రాకపోకలను నిలిపివేశారు. ఈ మేరకు ఆదేశాలిచ్చినట్లు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. - 8లో▸

న్యూస్‌రీల్

రత్నగిరికి పోటెత్తిన భక్తులు



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలి **వచ్చిన భక్తులతో** రత్నగిరి ఆదివారం కిటకిటలాడింది. సత్యదేవుని దర్శనానికి తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ భక్తులు వస్తూనే ఉన్నారు. ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు, వ్రత, విశ్రాంత మంటపాలు భక్తులతో నిండిపోయాయి. సుమారు 30 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించి పూజలు చేశారు. వ్రతాలు 2 వేలు జరిగాయి. ఉచిత దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో 5 వేల మందికి భోజనం పెట్టారు.

నేడు స్పందన

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం - జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి కలెక్టరేట్‌లో జరుగుతుంది. కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అలాగే డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం మంగళవారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. ప్రజలు తమ సమస్యలను 1800 425 3077 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తనకు నేరుగా తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

స్వల్పంగా ఏలేరు నీటి నిల్వల పెరుగుదల

ఏలేశ్వరం: ఏలేరు జలాశయంలో నీటినిల్వలు స్వల్పంగా పెరిగాయి. పరీవాహక ప్రాంతంలో వర్షాలు కురుస్తుండటంతో ఆదివారం 1,384 క్యూసెక్కుల నీరు చేరింది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా, 75.16 మీటర్లుగా నమోదైంది. రిజర్వాయర్ సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, 8.46 టీఎంసీల మేర నీటినిల్వలున్నాయి. ఆయకట్టుకు 500, విశాఖకు 200, తిమ్మరాజు చెరువుకు 50 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

లోవలో భక్తుల రద్దీ



లోవ దేవస్థానం ప్రాంగణంలో భక్తుల సందడి

తుని రూరల్: ఆషాఢ మాసోత్సవాలు ముగిసినా లోవ దేవస్థానానికి భక్తుల తాకిడి తగ్గలేదు. ఆదివారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో లోవలో సందడి నెలకొంది. క్యూలైన్ల ద్వారా 60 వేల మంది భక్తులు బాలాలయంలో తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ప్రసాదం విక్రయాలు, పూజా రుసుములు, కేశఖండన శాల, విరాళాలు కలిపి మొత్తం రూ.11,02,373 ఆదాయం సమకూరిందని వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం, కొండ దిగువన భక్తులు వంటలు, భోజనాలు చేశారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎక్కడా లేని విధంగా హజ్ యాత్రికులకు అన్ని సౌకర్యాలూ కల్పించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్ కృతజ్ఞతలు తెలిపారు. హజ్ నుంచి తిరిగి వచ్చిన వారి క్షేమ సమాచారం తెలుసుకోవడానికి ఆయన ఆదివారం రాజమహేంద్రవరం వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లింలు ఒక్కసారైనా మక్కా వెళ్లాలనుకుంటారని, వారి కలను సీఎం జగన్ నెరవేర్చారని అన్నారు. వారు వెళ్లడానికి అవసరమైన నగదు అందించడమే కాకుండా, వారి యోగక్షేమాలు తెలుసుకోవడానికి తనతో పాటు కమిటీ సభ్యులను కూడా పంపించారని చెప్పారు. తిరిగి వచ్చిన యాత్రికులను రిసీవ్ చేసుకునే బాధ్యత కూడా అప్పగించారన్నారు. గతంలో ఎవ్వరూ ఎప్పుడూ మైనార్టీలపై ఇంత ఆదరణ చూపలేదని అన్నారు. గత నెల 21న హజ్ యాత్రకు వెళ్లిన వారిలో కాకినాడకు చెందిన ఖాజా తిరుగు ప్రయాణంలో మదీనాలో గుండెపోటుతో మరణించారని లాజమ్ చెప్పారు. ఆయన మృతదేహాన్ని మదీనాలో ఖననం చేశారన్నారు. శనివారం గన్నవరం విమానాశ్రయం చేరుకున్న ఖాజా భార్యను ఓదార్చామని, అయితే సీఎం ఆదేశాల మేరకు కాకినాడ వెళ్లి, ఆమెను పరామర్శిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ బషీరుద్దీన్ పాల్గొన్నారు.

దీర్ఘాయుష్మాన్‌భవ



గర్భిణి ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ బత్తిన శిరీష

గర్భిణికి రక్షగా..

యు.కొత్తపల్లి మండలం నాగులాపల్లికి చెందిన ఎద్దు కిన్నెర వివాహమైన ఐదేళ్ల తర్వాత గర్భం దాల్చింది. ఆమె హిమోగ్లోబిన్ ప్రమాదకర స్థాయిలో 6 పాయింట్లు మాత్రమే ఉంది. నిరుపేద అయిన ఆమె హిమోగ్లోబిన్ స్థాయి పెంచేందుకు రెండు నెలల వైద్యానికి కాకినాడలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రి రూ.70 వేలు ఖర్చవుతుందని చెప్పింది. దీంతో కిన్నెర కుటుంబ సభ్యులు తమ వలంటీర్ భార్గవి ద్వారా విలేజ్ హెల్త్ క్లినిక్ సేవల గురించి తెలుసుకుని, ఎంఎల్‌హెచ్‌పీని సంప్రదించారు. ఆమె కిన్నెరను ఇంటి వద్దే ఉంచి ఐరన్ థెరపీ ప్రారంభించారు. కేవలం 4 నెలల వ్యవధిలోనే హిమోగ్లోబిన్ స్థాయి 11కు పెరిగింది. గత జూన్‌లో కిన్నెర పండంటి ఆడబిడ్డను సాధారణ కాన్పు ద్వారా ప్రసవించింది.

- పల్లె వైద్యానికి మహర్దశ
- వరంగా మారిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్
- జిల్లా వ్యాప్తంగా మొత్తం 410 క్లినిక్‌ల ద్వారా సేవలు
- ఉచితంగా 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల నుంచి రూపు దిద్దుకున్న డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్టులతో పల్లె వైద్యం దశ, దిశ మారిపోయాయి. స్థానిక ఆరోగ్య కేంద్రాలకు దాదాపు వెళ్లే అవసరం లేకుండానే ఇంటి వద్దనే ప్రభుత్వ వైద్య సేవలు అందుతున్నాయి. మంచానికే పరిమితమైన ఎంతోమందికి ఊపిరి పోస్తున్నాయి.

కాకినాడ క్రైం: ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. అటువంటి మహాభాగ్యాన్ని ప్రజలకు ఉచితంగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. ఫలితంగా ప్రభుత్వాసుపత్రుల్లోనే కార్పొరేట్ వైద్యం అందుతోంది. ఆరోగ్యశ్రీ పరిధిలోకి దాదాపు 4 వేల వ్యాధులను తీసుకువచ్చారు. పొరుగు రాష్ట్రాల్లోనూ వైద్య సేవలు పొందే అవకాశం కల్పించారు. నాడు–నేడు కింద ప్రభుత్వాసుపత్రుల్లో ఆధునిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేశారు. ఈ క్రమంలోనే వినూత్న రీతిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానాలకు శ్రీకారం చుట్టారు.



గర్భిణి గరికిన సుగుణకు మందులు ఇస్తున్న ఎంఎల్ హెచ్‌పీ మౌలిక



తూరంగిలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ మహారాణి

విలేజ్ హెల్త్ క్లినిక్‌లు

- చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు గ్రామాల్లోనే వైద్యం అందించేందుకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ కినిక్‌లు ఏర్పాటు చేశారు.. చేస్తున్నారు. వీటికి మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎంఎల్‌హెచ్‌పీ) సారథులుగా వ్యవహరిస్తున్నారు. వీరు నిత్యం ఓపీలు చూస్తూ తగిన వైద్య సేవలు అందిస్తారు. టెలికాలింగ్ సేవలు కూడా అందిస్తారు. మంచానికి పరిమితమైన రోగులను నేరుగా సందర్శించి, వారి ఆరోగ్య స్థితిని నిత్యం పర్యవేక్షిస్తారు.
- రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం ప్రతి 5 వేల జనాభాకు ఒక విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసింది. దీనికి పల్లె ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందనను గమనించి, ప్రతి 2,500 జనాభాకు ఒకటి చొప్పున జిల్లా వ్యాప్తంగా 410 విలేజ్ హెల్త్ కినిక్‌లు ఏర్పాటు చేసింది.
- వీటిల్లో వైద్య సేవలతో పాటు డిజిటల్ హెచ్‌బీ, యూరిన్ టెస్ట్ ఫర్ ప్రెగ్నెన్సీ, యూరిన్ టెస్ట్ ఫర్ పీహెచ్, స్పెసిఫిక్ గ్రావిటీ, గ్లూకోజ్, బిలురుబిన్, బ్లడ్ షుగర్, మలేరియా, హెచ్ఐవీ, డెంగీ, వీఐఏ, అయోడిన్ ఇన్ సాల్ట్, వాటర్ టెస్టింగ్ ఫర్ ఫీకల్ కంటామినేషన్, హెచ్‌బీఎస్ఏజీ, టీపీహెచ్ఏ, స్పూటమ్ ఫర్ ఏఎఫ్‌బీ కప్స్, కోవిడ్ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు.
- ఈ క్లినిక్‌లలో గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల నుంచి అకస్మాత్తుగా గుండె నొప్పికి గురైన వారికి ఇచ్చే ప్రాణాధార మందుల వరకూ 105 రకాల ఔషధాలు ఉచితంగా ఇస్తున్నారు.



ఫ్యామిలీ డాక్టర్

ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులున్నారు. వీరిలో ఎవరో ఒకరు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కింద ప్రతి నెలా రెండు రోజుల పాటు ఒక్కో సచివాలయానికి 104 వాహనంలో వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు. మరొకరు పీహెచ్‌సీలో ఉంటున్నారు. సంబంధిత సచివాలయానికి ముందు రోజు సమాచారం ఇస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో 12 రకాల వైద్య సేవలు, 67 రకాల మందులు ఉచితంగా అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్స జరిగిన వారికి, క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక జబ్బులతో మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి చిన్నారుల ఆరోగ్యాన్ని కూడా పరీక్షిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆరోగ్య సూచనలు అందిస్తున్నారు.

ఆరు నెలలుగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సేవల వినియోగం ఇలా..

జనవరి	:	2,66,910
ఫిబ్రవరి	:	2,43,002
మార్చి	:	2,89,101
ఏప్రిల్	:	2,14,994
మే	:	2,62,319
జూన్	:	2,53,091

ఈ సేవలు వినియోగించుకుంటున్న వారి సంఖ్య ప్రతి రోజూ జిల్లాలో సుమారు 10 వేలు, ప్రతి నెలా సగటున 2.54 లక్షలు పైగా ఉంటోంది.

పైసా ఖర్చు లేకుండా గుండె వైద్యం



గుండె జబ్బుతో బాధ పడుతున్నా. ప్రతి వారం కాకినాడ నాగమల్లితోట జంక్షన్‌లోని ఓ ఆసుపత్రిలో చూపించుకునేదాన్ని. ప్రస్తుతం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పూర్తి ఉచితంగా మందులు వాడుతున్నా. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నా. పైసా ఖర్చు లేకుండా అత్యంత నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు. ఒక్కోసారి నేను క్లినిక్‌కు వెళ్లడంలో నిర్లక్ష్యం చేస్తే మా ఎంఎల్‌హెచ్‌పీ శిరీష నేరుగా ఇంటికి వచ్చి వైద్యం అందిస్తున్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్ సేవలు ఎంతో మేలు చేస్తున్నాయి.

– **రెడ్డి చంటమ్మ**, ఫక్రుద్దీన్‌పాలెం హెచ్‌డబ్ల్యూసీ పరిధి, పిఠాపురం మండలం

ఇంటి వద్దనే వైద్య సేవలు



నాకు 88 ఏళ్లు. రక్తపోటు నుంచి మధుమేహం వరకూ వివిధ అనారోగ్య సమస్యలకు ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. అక్కడికి వెళ్లి వచ్చేందుకు వయోభారంతో సత్తువ, చేతిలో డబ్బులు ఉండేవి కాదు. మా ఎంఎల్‌హెచ్‌పీ మౌలిక మా ఇంటికి వచ్చి, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సేవల గురించి వివరించింది. ప్రతి వారం ఇంటికి వచ్చి నా ఆరోగ్యాన్ని పరీక్షించి, మందులు ఇచ్చి వెళ్తున్నారు. కాలు కదపకుండానే వైద్య సేవలు ఇంటి వద్ద అందుతున్నాయి. దీంతో పూర్తి ఆరోగ్యంగా ఉన్నా. ఈ వయసులోనూ నా పనులు నేనే చేసుకోగలుగుతున్నా.

– **ఉప్పురపల్లి కాసమ్మ** అమీనాబాద్-2 హెచ్‌డబ్ల్యూసీ పరిధి, యు.కొత్తపల్లి మండలం

పల్లెవాసులకు వరం



వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు పల్లెవాసులకు ఓ వరం. ఇల్లు దాటక్కర్లేదు, ఖర్చు చేయక్కర్లేదు. జిల్లాలోని 410 క్లినిక్‌ల సారథులయిన ఎంఎల్‌హెచ్‌పీలు అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ద్వారా కలెక్టర్‌కు నేరుగా నివేదిస్తున్నాం. ఈ సేవల పట్ల పల్లె ప్రజలు ఎంతో సంతృప్తి చెందుతున్నారు.

– **డాక్టర్ లెక్కల పావని**, డీపీఎంఓ, కాకినాడ

గోదారి పరవళ్లు

- ఎగువన తగ్గుతున్న నీటిమట్టాలు
- నేడు ధవళేశ్వరం వద్ద తగ్గే అవకాశం

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతోంది. శనివారం అర్ధరాత్రి వరకూ నిలకడగా కొనసాగిన గోదావరి ఆదివారం ఉదయం 10 గంటల వరకూ అదే స్థాయిలో ప్రవహించింది. అక్కడి నుంచి క్రమేపీ పెరుగుతూ వచ్చింది. బ్యారేజీ వద్ద నీటిమట్టం రాత్రి 8 గంటలకు 10.90 అడుగులకు చేరింది. ఇది మరి కొంత పెరిగి తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. బ్యారేజీలోని మొత్తం 175 గేట్ల ద్వారా 8,63,562 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. ఎగువన కాళేశ్వరం, పేరూరు, దుమ్ముగూడెం, భద్రాచలం తదితర ప్రాంతాల్లో నీటిమట్టాలు తగ్గుముఖం పట్టాయి. ఆ ప్రభావంతో ధవళేశ్వరం వద్ద కూడా నీటి ఉధృతి సోమవారం తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 42.40 అడుగులకు తగ్గింది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఎగువన నీటిమట్టాలు తగ్గుతూండటంతో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి నీటిమట్టం చేరే అవకాశం కనిపించడం లేదు. దీంతో ఇరిగేషన్ యంత్రాంగం కాస్త ఊపిరి పీల్చుకుంటోంది. నాలుగు రోజులుగా ఎగువన నీటిమట్టాలు పెరుగుతూండటంతో ధవళేశ్వరం ఫ్లడ్ కంట్రోల్ రూమ్ నుంచి ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 12,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 4 వేలు, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.



కాటన్ బ్యారేజీ వద్ద వరద గోదారి

గోదావరి నీటిమట్టాలు ఇలా..

గోదావరి ఎగువ ప్రాంతాలకు సంబంధించి కాళేశ్వరంలో 9.87, పేరూరు 15.22, దుమ్ముగూడెం 11.95 మీటర్ల చొప్పున, భద్రాచలం 42.40 అడుగులు, కూనవరం 17.92 మీటర్లు, కుంట 9.15, పోలవరం కాఫర్ డ్యామ్ వద్ద 33.01, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 15.73 మీటర్లుగా నీటిమట్టాలు నమోదయ్యాయి.

విజయములివ్వు విఘ్నేశ్వరా..

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యాన స్వామివారికి మేలుకొలుపు సేవ నిర్వహించారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 69 మంది భక్త దంపతులు, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 383 మంది, లక్ష్మీ గణపతి హోమంలో 22 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. 34 మంది చిన్నారులకు నామకరణ, అక్షరాభ్యాసం, అన్నప్రాశన, తులాభారం వంటివి నిర్వహించారు. ఐదుగురు తలనీలాలు సమర్పించారు. నూతన వాహనాలకు 25 మంది పూజలు చేయించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఆలయానికి రూ.1,51,038 ఆదాయం సమకూరిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

బాలబాలాజీ ఆలయానికి రూ.1.14 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి ఆలయానికి వివిధ సేవల ద్వారా ఆదివారం రూ.1.14 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.73,270, నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలుగా రూ.40,901 వచ్చాయి. స్వామి వారిని 2,364 మంది భక్తులు దర్శించుకున్నారు. అన్నప్రసాదం 1,870 మంది స్వీకరించారని ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు శ్రీరామ్ నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులు (ఒంగోలు) రూ.11,111 విరాళం ఇచ్చారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



అమలాపురం బాలయోగి స్టేడియంలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: మహిళా సంఘాల సభ్యులకు సున్నా వడ్డీ పథకం నిధులు జమ చేసేందుకు ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం అమలాపురం వస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక బాలయోగి స్టేడియంలో సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదివారం సాయంత్రం అధికారులతో కలిసి పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ, పురపాలక సంఘ ఇంజినీర్లకు మంత్రి పలు సూచనలు చేశారు. అనంతరం సీఎం బహిరంగ సభ వేదిక పనులను పరిశీలించారు. సోమవారం సాయంత్రానికి అన్ని పనులూ పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. మంత్రి వెంట జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరిరామ్ గోపాలరావు, గెద్దం సంపదరావు ఉన్నారు.

పార్కింగ్ స్థలాల ఎంపికపై సమీక్ష

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన, బహిరంగ సభకు సంబంధించి పార్కింగ్ స్థలాల ఎంపికపై జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ పోలీసు, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి బహిరంగ సభ జరిగే అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో కేటగిరీల వారీగా పార్కింగ్ స్థలాలను ఎంపిక చేసే విషయంపై ఆ ప్రాంతాన్ని పోలీసు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఎస్పీ శ్రీధర్‌తో పాటు ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, ఆర్డీఓ వసంత రాయుడు, డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్‌లు పార్కింగ్ స్థలాలను పరిశీలించి, ఎంపిక చేశారు. సభకు వచ్చే వాహనాలకు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. బాలయోగి స్టేడియం, అయినవిల్లి రోడ్డు, కిమ్స్ వైద్య కళాశాలకు వెళ్లే రోడ్లను అధికారుల బృందం పరిశీలించింది.

సురక్ష సూపర్

- అవసరమైన సర్టిఫికెట్లు చిటికెలో చేతిలోకి..
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం
- జిల్లాలో ఇప్పటి వరకూ 2.37 లక్షల ధ్రువపత్రాల అందజేత

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. గతంలో కుల, ఆదాయ, నివాస తదితర ధ్రువపత్రాలు కావాలంటే దరఖాస్తుదారులు ఈ–సేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించి, వేలాది రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ధ్రువపత్రం చేతికి వచ్చేసరికి 15 రోజులు పట్టేది. ఒక్కోసారి అంతకు మించి సమయం పట్టేంది. గ్రామ/వార్డు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు వచ్చిన తరువాత చాలా మందికి ఈ బాధ తప్పింది. వలంటీర్లే ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి, సచివాలయాల ద్వారా ప్రాసెస్ చేయించి, వీలైనంత త్వరగా మంజూరు చేస్తున్నారు. అయినప్పటికీ కొంత మంది వివిధ సంక్షేమ పథకాలకు, ప్రభుత్వ కార్యక్రమాలకు, ఇతర అవసరాలకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను సరైన అవగాహన లేక పొందలేకపోతున్నారు.

జిల్లాలో సచివాలయాలు	:517
క్లస్టర్లు	:10,238
సర్వే ప్రారంభమైనవి	:10,161
ఇళ్లు	:6,17,728
సర్వే పూర్తి చేసినవి	:4,66,421
వలంటీర్ యాప్‌లో నమోదైన అర్జీలు	:2,55,479
జారీ చేసిన ధ్రువపత్రాలు	:2,37,773

ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం.. జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీని ద్వారా ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి, వివిధ ధ్రువీకరణ పత్రాలు అవసరమైన వారిని గుర్తిస్తున్నారు. వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి, కావలసిన సర్టిఫికెట్లను వెంటనే ఉచితంగా అందజేస్తున్నారు. దీనిపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి యూజర్ చార్జీలూ వసూలు చేయకుండా లబ్ధిదారులకు అవసరమైన ధ్రువపత్రాలను సచివాలయంలో నిర్వహించే గ్రామసభల్లో అందించే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ, విజయవంతం కావడానికి తోడ్పడుతున్నారు.



కరపలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు (ఫైల్)


ఇలా నిర్వహించారు

జగనన్న సురక్ష కార్యక్రమం జిల్లాలోని 620 సచివాలయాల్లో ఈ నెల 1న ప్రారంభమైంది. దీనికి పది రోజుల ముందు నుంచే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు క్లస్టర్ల వారీగా ఇంటింటా సర్వే నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా జిల్లాలోని 20 మండలాలు, 7 మున్సిపాలిటీల్లోని మొత్తం 10,238 క్లస్టర్లకు గాను 10,161 క్లస్టర్లలో ఈ సర్వే జరిగింది. జిల్లా వ్యాప్తంగా 6,17,728 ఇళ్లు ఉండగా వాటిలో 4,66,421 గృహాల సర్వేను పూర్తి చేశారు. వీరిలో 2,55,479 మంది దరఖాస్తులను వలంటీర్లు తమ వద్ద ఉన్న మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. వాటిపై అధికారులు విచారణ నిర్వహించారు. ఎటువంటి అభ్యంతరాలూ లేని, వివాదాస్పదం కాని వాటిని ఎంపిక చేసి 2,37,773 దరఖాస్తులకు టోకెన్ నంబర్లు జారీ చేశారు. ఇలా టోకెన్లు జారీ చేసిన దరఖాస్తులకు అవసరమైన ధ్రువప్రతాలను క్లస్టర్ల వారీగా సిద్ధం చేసి, వాటి పంపిణీని గ్రామసభల్లో ప్రారంభించారు. మొదటి 22 రోజుల్లోనే 2,25,727 మందికి (96 శాతం) వివిధ రకాల ధ్రువపత్రాలను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

సురక్షలో అందిస్తున్న సేవలివీ..

కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు, జనన, మరణ, మ్యుటేషన్, వివాహ రిజిస్ట్రేషన్, వారసత్వ, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం, రైస్ కార్డు, కౌలు రైతుల గుర్తింపు కార్డు, రేషన్ కార్డు నుంచి వివాహం అయిన సంతానాన్ని వేరు చేయడం.

రెండు రోజుల్లో ధ్రువీకరణ పత్రాలు



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నాకు రెండు రోజుల్లోనే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందించారు. వీటి కోసం గతంలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే కనీసం 15 రోజులు పడుతుందని చెప్పారు. ఇంతలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం కావడంతో మా ఇంటికి వచ్చిన వలంటీర్‌కు ఈ విషయం చెప్పి, అవసరమైన పత్రాలన్నీ ఇచ్చాం. వీటిని అధికారులు పరిశీలించి రెండు రోజుల్లోనే మా సచివాలయంలో జరిగిన గ్రామసభలో నాకు ధ్రువపత్రాలు అందించారు.

– **వెంటకుల దేవుడమ్మ**, తూరంగి

అర్హులందరికీ సంక్షేమం



అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ 100 శాతం సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందించాలన్నదే జగనన్న సురక్ష లక్ష్యం. వలంటీర్, సచివాలయ అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి మరీ ప్రభుత్వ పథకాలు, సేవలు అందిస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ఇటువంటి కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. దీనిపై ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– **కృతికా శుక్లా**, జిల్లా కలెక్టర్

క్లుప్తంగా

సముద్రంలో బాలుడి గల్లంతు


పార్థు

కొత్తపల్లి: సముద్రంలో ఓ బాలుడు గల్లంతైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సామర్లకోట మండలం వేమవరం గ్రామానికి చెందిన పసుపులేటి వీర ప్రభాకరరావు తన కుటుంబ సభ్యులతో కలసి తుని రూరల్ లోవలోని తలపులమ్మ తల్లి ఆలయానికి వెళ్లారు. తిరిగి వస్తూ మండలంలోని పొన్నాడ శివారు కోపపాపపేట ఎస్ఎస్ఆర్ హేచరీ ఎదురుగా ఉన్న తీర ప్రాంతంలో కుటుంబ సభ్యులతో దిగారు. కొంతసేపు కెరటాలలో అంతా కేరింతలు కొట్టారు. అనంతరం ఆటో ఎక్కిన తరువాత వీరప్రభాకరరావు రెండో కుమారుడు పసుపులేటి పార్థు కమలచక్రి (9) కనిపించకపోవడంతో సముద్రంలో గల్లంతైనట్లు గుర్తించారు. బాలుడి ఆచూకీ కోసం మత్స్యకారులు గాలింపు చేపట్టారు. పోలీసులకు సమాచారం అందించడంతో పిఠాపురం సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్సై రామలింగేశ్వరావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాలుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో తండ్రి వీరప్రభాకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పార్థు కాకినాడలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు.

ఆవులను ఢీకొట్టి బోల్తా పడిన లారీ


ప్రమాదంలో మృతి చెందిన ఆవు

గోకవరం: వీరలంకపల్లి గ్రామ శివారున ఆదివారం ఉదయం అదుపుతప్పిన ఓ లారీ రెండు ఆవులను ఢీకొని బోల్తా పడింది. ఆ వివరాల ప్రకారం.. ముమ్మిడివరం నుంచి ఛత్తీస్‌ఘడ్‌కు కొబ్బరికాయల లోడుతో వెళుతున్న లారీ వీరలంకపల్లికి వచ్చేసరికి అదుపు తప్పింది. ఈ నేపథ్యంలో రెండు ఆవులను ఢీకొట్టి కొంత దూరం వెళ్లి బోల్తా పడింది. ఈ సమయంలో డ్రైవర్ మద్యం తాగి ఉన్నాడని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌లు స్వల్ప గాయాలతో బయట పడగా, ఒంగోలు జాతికి చెందిన రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. వీటి విలువ సుమారు రూ.1.80 లక్షలు ఉంటుందని రైతు కొరిపల్లి అప్పలస్వామి ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న గోకవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే మృతి చెందిన ఆవులకు పశు వైద్యాధికారి పంచనామా నిర్వహించారు.


బోల్తా పడిన లారీ

భక్త మహాశయులకు...

- అన్నవరం దేవస్థానం సౌకర్యాలు
- నడక దారిలో డార్మెట్రీ నిర్మాణం
- 90 శాతం పూర్తయిన పనులు
- రూ.రెండు కోట్లతో భక్తుల వసతికి ఏర్పాట్లు


వనదుర్గ ఆలయం వద్ద సిద్ధమవుతున్న విశ్రాంతి భవనం

అన్నవరం: ఆధ్యాత్మిక చింతనతో.. మది నిండా భక్తిభావంతో.. ఆ స్వామివారిని స్మరిస్తూ రత్నగిరికి కాలినడక వచ్చే భక్త మహాశయులకు సౌకర్యాలు ఒనగూరుతున్నాయి.. మెట్ల మార్గం నుంచి అలసి సొలసి వచ్చేవారి కోసం విశ్రాంతి భవనం (డార్మెట్రీ) సకల హంగులతో రూపుదిద్దుకుంటోంది.. రత్నగిరిపై వనదుర్గ ఆలయం ఎదురుగా రూ.రెండు కోట్లతో దాత పెన్నాడ వెంకట రాజామణి సారథ్యంలో భక్తుల విశ్రాంతి భవన నిర్మాణం జరుగుతోంది. ఇది ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి కానుంది. గత ఏడాది ఆగస్టులో పనులు ప్రారంభం కాగా, ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి. వచ్చే ఆగస్టు నెలాఖరుకు మిగిలిన పనులు పూర్తి చేసి డార్మెట్రీని దేవస్థానానికి అప్పగించాలని దాత నిర్ణయించారు. డార్మెట్రీని దేవస్థానానికి అప్పగించిన వెంటనే ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఈఓ చంద్రశేఖర్ అజాద్ వివరించారు.

అలా పునాది పడి..

రత్నగిరి సత్యదేవుని దర్శనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. ఇందులో చాలామంది మెట్ల దారి నుంచి వచ్చి మొక్కులు తీర్చుకుంటుంటారు. అలాంటి వారికోసం డార్మెట్రీ నిర్మించాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు. బాత్‌రూమ్‌లలో స్నానం చేసి, తమ వస్తువులను అక్కడే లాకర్లలో భద్రపర్చుకునేందుకు శ్రీవనదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ఈ భవనం చేపట్టాలని భావించారు. ఈ సమయంలోనే రాజమహేంద్రవరానికి చెందిన దాత పెన్నాడ వెంకట రాజామణి డార్మెట్రీ నిర్మించడానికి ముందుకు వచ్చారు. అప్పటి ఈఓ వి.త్రినాథరావు శ్రీవనదుర్గ ఆలయం వద్ద ఉన్న పాత భవనాన్ని కూల్చి వేసి ఆ స్థలాన్ని దాతకు అప్పగించారు. ఈ నిర్మాణానికి గత ఏడాది ఆగస్టు 13న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్ భూమిపూజ చేశారు.


భక్తుల విశ్రాంతి భవనం చిత్రాన్ని విడుదల చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే పర్వత, దాత రాజామణి (ఫైల్)

ఆగస్టు నెలాఖరుకు సిద్ధం



సత్యదేవుని సన్నిధికి వచ్చే భక్తుల సౌకర్యార్థం దాత రాజామణి డార్మెట్రీ నిర్మిస్తున్నారు. అనుకున్న సమయానికన్నా పనులు వేగంగా చేస్తున్నారు. ఆగస్టు నెలాఖరుకు దీనిని పూర్తి చేసి దేవస్థానానికి అప్పగిస్తామని చెప్పారు. మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధి, దేవదాయశాఖ ఉన్నతాధికారులతో కలసి ప్రారంభోత్సవ తేదీ ఖరారు చేస్తాం.

–చంద్రశేఖర్ అజాద్, ఈఓ, అన్నవరం దేవస్థానం

వేయి మంది సేద తీరేలా..

మొత్తం 3,900 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడంతస్తులలో ఈ భవనం నిర్మిస్తున్నారు. ఏకకాలంలో సుమారు వేయి మంది సేదతీరే విధంగా సౌకర్యాలు కల్పిస్తున్నారు. మూడు అంతస్తులలోనూ టాయిలెట్లు, స్నానపు గదులు ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల భక్తులు కొండపై వసతి గదుల కోసం ప్రయత్నించకుండా ఇక్కడే స్నానం చేసి స్వామివారిని దర్శనానికి రావొచ్చని అధికారులు తెలిపారు. ఈ పనులు ప్రారంభించిన మూడు నెలలకే పునాదుల దశ పూర్తి చేయగా, ఏప్రిల్ నెలలోనే మూడు శ్లాబ్‌ల నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తయి వెలుపల ప్లాస్టింగ్, టైల్స్ అతికించడం పనులు చేస్తున్నారు. టాయిలెట్ల నిర్మాణం, విద్యుత్తు సరఫరా పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని నిర్మాణ కాంట్రాక్టర్ అబ్బులు తెలిపారు.

మహా ప్రసాదం స్వామీ..


భక్తులకు ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

అన్నవరం: సత్యదేవుని దర్శనం అనంతరం స్వామివారి ప్రసాదం స్వీకరిస్తే ఆ భాగ్యమే వేరు.. అన్నవరం రత్నగిరిపై సత్యదేవుని దర్బారు మండపం విశాలంగా తయారు చేసిన తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ సజావుగా సాగుతోంది. ఉదయం 8 నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ పంపిణీ చేస్తుండడంతో సంతృప్తి చెందుతున్నారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశాలతో దర్బారు మండపం ముందు ఉన్న గోడలు తీసేయడంతో విశాలమైన మండపం ఏర్పాటైంది. అక్కడ క్యూ ఏర్పాటు చేసి రెండు వైపులా తీర్థంతో పాటు పులిహోర ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేశారు. దీనివల్ల తొక్కిసలాట లేకుండా ప్రసాదాల పంపిణీ జరుగుతోంది. గతంలో సత్యదేవుని దర్బారు మండపంలో కేవలం 25 కిలోల బియ్యంతో చేసిన పులిహోర పంపిణీ చేసేవారు. మధ్యాహ్నం 12 గంటలకే పులిహోర అయిపోయేది. దశమి, ఏకాదశి, శనివారం, ఆదివారం తదితర రోజుల్లో ఉదయం పది గంటలకే ప్రసాదాల పంపిణీ ముగిసేది. దీంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేసేవారు. ప్రస్తుతం 60 కిలోల బియ్యంతో పులిహోర తయారు చేసి పంపిణీ చేయాలని, అవసరమైతే ఎక్కువ తయారు చేయించాలని ఈఓ ఆదేశించారు. గతంలో సరైన క్యూ లేక భక్తులంతా ఒకేసారి మీద పడిపోతుంటే తీర్థ ప్రసాదాలిచ్చే అర్చక స్వాములకు ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు రెండు చోట్ల పంపిణీ జరిగేలా ఏర్పాట్లు చేయడంతో ఆ ఇబ్బంది తప్పింది.

ప్రియురాలిని హత్య చేసింది ప్రియుడే!

- నిందితుడు నాగబాబు, సహకరించిన నరసింహం అరెస్ట్
- హత్య కేసును ఛేదించిన పోలీసులు


మల్లేశ్వరితో ప్రియుడు నాగబాబు, వారి కుమార్తె (ఫైల్)

అమలాపురం టౌన్: స్థానిక వనచర్ల వీధికి చెందిన శ్రీపతి మల్లేశ్వరి (24)ది హత్యేనని పోలీసు దర్యాప్తులో తేలింది. రెండు వారాలుగా సాగుతున్న ఈ కేసు చిక్కుముడి చివరికి వీడింది. డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి లోతుగా దర్యాప్తు చేసి హత్య కోణాన్ని వెలికి తీశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం డీఎస్పీ అంబికా ప్రసాద్ వివరించారు. ఆయన కథనం మేరకు.. నాగబాబు, మల్లేశ్వరిలకు గతంలో వేర్వేరుగా పెళ్లిళ్లు జరిగాయి. నాగబాబు భార్యను, మల్లేశ్వరి భర్తను వదిలేసి వీరిద్దరూ స్థానిక వనచర్ల వీధిలో సహ జీవనం సాగించారు. వీరికి రెండున్నరేళ్ల కుమార్తె కూడా ఉంది. మల్లేశ్వరి వేరే వ్యక్తితో అక్రమ సంబంధం కలిగి ఉందన్న అనుమానంతో ఆమెను నాగబాబు తరచూ మద్యం తాగి వేధించేవాడు. ఐదేళ్ల కిందట అమలాపురంలో నాగబాబు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నప్పుడు అందులో పనిచేసే ఓ వ్యక్తితో అక్రమ సంబంధం కలిగి ఉందన్నది నాగబాబు అనుమానం.

హత్య చేసిందిలా..

ఈ నెల 7వ తేదీ రాత్రి నుంచి మల్లేశ్వరి కనిపించకపోవడంతో ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొలుత అమలాపురం పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. తర్వాత 9వ తేదీ ఉదయం అమలాపురం బైపాస్ రోడ్డులో శ్మశానం వద్ద పంట కాలువ నీటి అంచున మల్లేశ్వరి మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండడాన్ని స్థానికులు, పోలీసులు గుర్తించారు. 7వ తేదీ రాత్రి వనచర్లవారి వీధిలోని వారున్న ఇంట్లోనే మల్లేశ్వరి మెడకు చీరను బిగించి నాగబాబు హత్య చేశాడు. అతనికి ఆ ఇంటి యాజమాని కుమారుడు కముజు నరసింహం సహకరించాడు. అప్పటికే చనిపోయిన మల్లేశ్వరికి ఒంట్లో బాగోలేదని.. ఆస్పత్రికి తీసుకు వెళుతున్నామని ఇరుగు పొరుగు వారికి చెప్పి నాగబాబు, నరసింహం ఇద్దరూ మోటారు సైకిల్‌పై ఆమె మృతదేహాన్ని తీసుకు వెళ్లారు. పంట కాలువ వద్దకు వెళ్లి మృతదేహాన్ని పడేశారు. మృతదేహం కాలువలో కొట్టుకుపోయి సముద్రంలో కలిసిపోతుందని వారు అంచనా వేశారు. అయితే ఆ మృతదేహం కాలువ నీటి అంచునే ఆగిపోవడంతో వారి పథకం నెరవేరక ఆనక వారి కుట్ర బయటపడింది. పోస్టుమార్టం నివేదిక వస్తేనే గాని అది ఆత్మహత్యా... హత్యా అనేది ఇప్పుడే చెప్పలేమని అప్పట్లో పోలీసులు అనుమానాస్పద మృతిగా నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదికలో మల్లేశ్వరిది హత్యేనని తేలడంతో పోలీసులు ఈ కేసును హత్య కేసుగా మార్చి ఆ దిశగా దర్యాప్తు చేశారు. నిందితుడు నాగబాబు, సహకరించిన నరసింహంలను అరెస్ట్ చేసి ఆదివారం కోర్టులో హాజరు పరిచారు. కోర్టు రిమాండ్ విధించడంతో వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు పట్టణ సీఐ దుర్గాశేఖరరెడ్డి తెలిపారు.

భారీ వాహనాలకు నో ఎంట్రీ

- రోడ్ కం రైలు వంతెనపై లారీలు, బస్సులకు బ్రేక్
- రెండు, మూడు చక్రాల వాహనాలు, కార్లకు అనుమతి
- గామన్ బ్రిడ్జి మీదుగా భారీ వాహనాల రాకపోకలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)/కొవ్వూరు: రాజమహేంద్రవరం– కొవ్వూరును అనుసంధానిస్తూ ఉన్న రోడ్ కం రైలు వంతెనపై ఆదివారం నుంచి లారీలు, బస్సుల రాకపోకలను నిలిపివేశారు. ఈ మేరకు ఆదేశాలిచ్చినట్లు కలెక్టర్ మాధవీలత ఆదివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. రోడ్ కం రైలు బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన తరువాత 1974 నుంచి అన్ని వాహనాల రాకపోకలు జరిగాయన్నారు. ఈ బ్రిడ్జి జీవిత కాలం 65 ఏళ్లుగా నిర్ణయించారని, ఇది అందుబాటులోకి వచ్చి 49 సంవత్సరాలు పూర్తి అవుతుందన్నారు. రోజు రోజుకూ విపరీతమైన పెరుగుతున్న ట్రాఫిక్ నేపథ్యంలో బ్రిడ్జి డెక్ జాయింట్‌లు దెబ్బతింటున్నాయన్నారు. వంతెన భద్రత దృష్ట్యా ఆర్అండ్‌బీ అధికారుల సూచనల మేరకు లారీలు, బస్సులు తిరగడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు. వంతెన మరిన్ని సంవత్సరాల పాటు ప్రజలకు అందుబాటులో ఉండే విధానంగా టూ వీలర్స్, మూడు చక్రాల వాహనాలు, కార్లు తిరిగేందుకు చర్యలు తీసుకున్నామని మాధవీలత పేర్కొన్నారు. ఈ వంతెన మీదుగా 10.2 టన్నుల బరువు మించి ఉన్న వాహనాలు తిరిగితే వంతెన దెబ్బతినే అవకాశం ఉందని 2007, 2011లలో నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చిందని అన్నారు. ఈ దృష్ట్యా ప్రజలు సహకరించాలని కోరారు. అనుమతించిన వాహనాలు మాత్రమే వంతెనపై నుంచి తిరిగేలా మధ్యలో పోల్స్ ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. కొవ్వూరు– రాజమహేంద్రవరం మీదుగా ప్రయాణించే భారీ వాహనదారులు, బస్సులు జాతీయ రహదారిపై ఉన్న నాలుగు లైన్ల వంతెన గామన్ బ్రిడ్జి (4వ వంతెన) మీదుగా వెళ్లాలని కలెక్టర్ తెలిపారు. ఇదిలా ఉంటే రోడ్డు కం రైలు వంతెన నుంచి లారీలు, బస్సులు, లోడు వాహనాలు వెళ్లకుండా కొవ్వూరు టోల్‌గేట్ జంక్షన్ వద్ద పట్టణ పోలీసులు గస్తీ ఏర్పాటు చేశారు.


కొవ్వూరు టోల్‌గేట్ జంక్షన్ వద్ద బారికేడ్ ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసు

డెంగీతో ఖైదీ మృతి

కాకినాడ క్రైం: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఓ ఖైదీ డెంగీతో మృతిచెందాడు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం ముప్పరాజువారి పాలేనికి చెందిన బొట్ల వీరాంజనేయులు (31) తండ్రిని చంపిన నేరంలో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ నెల 13న తీవ్ర కడుపునొప్పి, రక్తపు వాంతులతో బాధపడుతూండగా జైలు అధికారులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సిఫార్సు మేరకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఇక్కడ 14న ఉదర సంబంధిత శస్త్ర చికిత్స చేశారు. నాటి నుంచి వైద్య సేవలు పొందుతూండగా వీరాంజనేయులు డెంగీ సోకి ప్రాణాలు కోల్పోయాడు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్


రౌతులపూడిలో పోలీస్ అవుట్‌పోస్టు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్

రౌతులపూడి: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ఆదివారం రౌతులపూడిలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్‌పోస్టును ఆయన ప్రారంభించారు. దీనికి ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఇక్కడ పోలీస్ స్టేషన్ లేక సుదూర ప్రాంతాల్లో ఉన్న కోటనందూరు, తుని రూరల్, అన్నవరం పోలీస్ స్టేషన్లకు వెళ్లి ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాల్సి వచ్చేదన్నారు. ఈ ఇబ్బందులను ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి ఇక్కడ పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేయించారన్నారు. ముఖ్యంగా విశాఖ మన్యం ప్రాంతాలకు దగ్గరగా ఉన్న ఈ ప్రాంతంలో విచ్చలవిడిగా గంజాయి అక్రమ రవాణా, ఇతర అసాంఘిక శక్తుల కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయన్నారు. వీటిపై త్వరలోనే ఉక్కుపాదం మోపుతామని ఆయన తెలిపారు. పూర్తిస్థాయి పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు శాఖాపరమైన, కోర్టులకు సంబంధించి పలు పనులు మిగిలి ఉన్నాయని, వాటిని రెండు నెలల్లో పూర్తిచేసి పూర్తిస్థాయిలో స్టేషన్‌గా పరిగణిస్తామన్నారు. ప్రస్తుతం ఒక ఎస్సై, 14 మంది సిబ్బందితో పోలీస్ స్టేషన్ నిర్వహణ ఉంటుందన్నారు. ఎంపీ గీత మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే ప్రసాద్ ప్రభుత్వంలోని పెద్దలకు, పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. ఎమ్మెల్యే పర్వత మాట్లాడుతూ స్థానికంగా పోలీస్ స్టేషన్ లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అవసరమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇక్కడ తన సమక్షంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అన్ని వ్యవస్థల కంటే పోలీస్ వ్యవస్థ చాలా కీలకమైందని, ప్రజలంతా సహకరించాలని ఆయన సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచ్ కటారి అర్జునమ్మ, కాకినాడ జిల్లా అడ్మిన్ ఎస్పీ పి.శ్రీనివాస్, ఏపీఎస్పీ ఏఎస్పీ బి.సత్యనారాయణ, పెద్దాపురం డీఎస్పీ కె.లతా కుమారి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యకు మహర్దశ

వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల వైద్య విభాగ సమన్వయకర్త మురళీకృష్ణ



కాకినాడ క్రైం: కనీవినీ ఎరుగని రీతిలో ఏకకాలంలో రాష్ట్రంలో 17 వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టడం సంచలనమని వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల వైద్య విభాగ సమన్వయకర్త, కాకినాడకు చెందిన ప్రముఖ సాంక్రమిక వ్యాధుల నిపుణుడు యనమదల మురళీకృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైద్య విద్యకు మహర్దశ పట్టిందని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి కొత్తగా నిర్మిస్తున్న వాటిలోని ఐదు కళాశాలలలో 750 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనుమతిచ్చిందని అన్నారు. కేంద్ర వైద్య మండలి నిబంధనలను అనుసరించి పదిహేను శాతం సీట్లు సెంట్రల్ పూల్‌కి కేటాయించాల్సి ఉందని, అయితే రాష్ట్ర విద్యార్థులు ఈ సీట్లు పొందడంలో ముందు వరుసలో ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో చంద్రబాబు మంగళగిరి ఎయిమ్స్ తప్ప ఒక్క వైద్య కళాశాలను తీసుకురాలేకపోయారని గుర్తు చేశారు. అది కూడా విభజన హామీలలో వచ్చిందే తప్ప బాబు చేసిన కృషి ఏమీ లేదన్నారు. ప్రస్తుతం నూతన వైద్య కళాశాల రాకతో 375 ఎంబీబీఎస్ సీట్లు రూ.17 వేల వార్షిక ఫీజుతో భర్తీ కానున్నాయని, ఇది సామాన్యులకు అనుకూలించే అంశమని గుర్తు చేశారు. అలాగే ఎంబీబీఎస్ మొదటి ఏడాదిలో బోధించే అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ సబ్జెక్టుల బోధనకు అవసరమైన అన్ని వసతుల ఏర్పాటుకు నూతన భవనాల నిర్మాణంలో ఇంజినీరింగ్ ప్రణాళికలు సిద్ధమయ్యాయని తెలిపారు. రెండవ ఏడాది నుంచి క్లినికల్స్ మొదలవుతాయని, అప్పుడు మాత్రమే అనుబంధ వైద్య శాలల అవసరం ఉంటుందని డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. ఇన్ని అనుకూలతల మధ్య ప్రతికూలతలు వెదుకుతూ ప్రజల్ని తప్పుదారి పట్టించడం ఓ వర్గం మీడియాకు పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల సమీకరణ కోసం సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల కేటాయింపు వైద్య విద్య ప్రారంభం నుంచి ఉన్నదేనని తెలిపారు. కేవలం రూ.17 వేల వార్షిక మొత్తానికి కేటాయించే ప్రయోజనాలను వదిలేసి 375 సీట్లకు అధిక ఫీజులంటూ తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని సూచించారు.

రోప్ స్కిప్పింగ్ క్రీడాకారుల ఎంపిక


రోప్ స్కిప్పింగ్‌కు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థలో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రోప్ స్కిప్పింగ్ క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ పోటీలకు పిఠాపురం, జగన్నాథగిరి, వి.కొత్తూరు, ఎస్.అన్నవరం, తుని నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్ 11, 14, 17, 19 విభాగాల్లో బాలికలు, బాలురను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు జూలై 28, 29 తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. రోప్ స్కిప్పింగ్ సంఘ గౌరవాధ్యక్షుడు కేఎస్ జాబేజ్, కార్యదర్శి బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రశాంతకుమార్, శ్రీనివాస్, సాధన, వరలక్ష్మి, పరదేశమ్మ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన టీటీ పోటీలు


బహుమతులు అందుకున్న విజేతలతో విజయప్రకాష్ తదితరులు

పెద్దాపురం: స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఫ్యూచర్ స్టార్స్ టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారంతో అట్టహాసంగా ముగిశాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సభలో టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.మోహన్‌బాబు, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ వి.భాస్కరరామ్ మాట్లాడారు. భవిష్యత్‌లో ఒలింపిక్స్‌కు టేబుల్ టెన్నిస్ అకాడమి నుంచి క్రీడాకారులు ఎంపిక కావాలన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించిన శ్రీప్రకాష్ టీటీ అకాడమీ నుంచి నాణ్యమైన క్రీడాకారులను తయారు చేయాలన్నారు. అనంతరం విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరిగింది. విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీ నరసింహారావు, రామసీత, ప్రిన్సిపాల్ మూర్తి, రిఫరీలు రమణకుమార్, వేణుగోపాల్, బాలదుర్గారావు, ఆయా జిల్లాల నుంచి వచ్చిన 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అండర్–11 బాలికల విభాగంలో పూజిత, బాలుర విభాగంలో ఎస్.మోహిత్‌శ్రీకపీస్, అండర్–13 బాలికల విభాగంలో అరీఫ్‌సుల్తానా, బాలుర విభాగంలో అచ్యుత్ విశ్వనాథ్, అండర్–15 బాలికల విభాగంలో జి.సుష్మిత, బాలుర విభాగంలో ప్రత్యూష, బాలుర డబుల్స్ విభాగంలో ప్రత్యక్ష్ అలెన్, అండర్–17 బాలికల విభాగంలో జి.సుష్మిత, బాలుర విభాగంలో సాయికార్తీక్, మహిళా విభాగంలో దర్శిక, పురుషుల విభాగంలో ఏడి మణికంత, మిక్స్‌డ్ డబుల్ విభాగంలో పి.శ్రీలక్ష్మి, చరణ్ కార్తీక్, మహిళా డబుల్స్ విభాగంలో అర్షియా, సుష్మిత, పురుష డబుల్స్ విభాగంలో మోహిత్‌శర్మ, వై.ఆనందరాజ్ విజేతలుగా నిలిచారు.